సాక్షి జగిత్యాల

గురువారం । 30 । మార్చి । 2023



కొండపై నటుడు వేణు పూజలు

కొండగట్టు : బలగం సినీ దర్శకుడు, నటుడు యెల్దండి వేణు బుధవారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



నృసింహునికి మొక్కులు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
38.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

అర్థరహితమైన మాటలకన్నా అర్థవంతమైన నిశ్శబ్దం చాలా గొప్పది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6.33	శుక్ర 4.46

రంజాన్ వేళలు

ప్రగతి పథంలో పల్లెలు

- పారిశుధ్యం నిర్వహణలో భేష్
- పరిసరాల పరిశుభ్రతలో అగ్రస్థానం
- పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించడంలో సత్ఫలితం
- ఇంటింటికీ మెరుగైన, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా
- తొమ్మిది అంశాల్లో ప్రతిభ చూపిన 27 గ్రామాలు
- అవార్డులు, ప్రశంసపత్రాలతో పాలకవర్గాలకు గౌరవం
- జాతీయస్థాయి పురస్కారాలకు సిఫారసు



కోరుట్ల మండలం నాగులపేటలో పల్లె ప్రకృతి వనం



మంత్రి ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్ బాషా నుంచి అవార్డు అందుకుంటున్న కలిగోట సర్పంచ్, కార్యదర్శి(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): పాలకులు, అధికారులు సమన్వయంతో పనిచేశారు.. మెరుగైన పారిశుధ్యం సాధించారు. పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించారు. ఇంటింటికీ తాగునీటి సరఫరా మెరుగుపర్చారు. ప్రతీ ఇంట మరుగుదొడ్డి నిర్మించారు. ఇంకుడుగుంత తవ్వించారు. తద్వారా పల్లెలను ప్రగతి పట్టాలు ఎక్కించి పరుగులు పెట్టిస్తున్నారు. ఇలాంటి పంచాయతీలకు వివిధ విభాగాల్లో జాతీయస్థాయిలో అవార్డులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలోని 380 గ్రామపంచాయతీల వివరాలను గతేడాది నవంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పరిశీలించిన పంచాయతీరాజ్ విభాగం అధికారులు 27 పంచాయతీలకు జిల్లాస్థాయి అవార్డులు, ప్రశంసపత్రాలు అందించారు. వీటిని రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులకు సిఫారస్ చేశారు.

9 అంశాలు ఇవీ..

ఆరోగ్యకరమైన పంచాయతీ. పేదరికంలేని, మెరుగైన జీవనోపాధి. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ. తాగునీటి సరఫరా. పచ్చదనం- పరిశుభ్రత. పంచాయతీ స్వీయ- సన్నద్ధమైన మౌలిక సదుపాయాల కల్పన. సామాజిక భద్రత. సుపరిపాలన. మహిళా సాధికారత.. వంటి తొమ్మిది అంశాలు సహా వంద శాతం ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసిన వాటికి ఇందులో మార్కులు కేటాయించారు. ప్రతీ అంశంలో మూడు గ్రామపంచాయతీలను జిల్లాస్థాయి అవార్డులకు ఎంపిక చేశారు.

అవార్డులు అందుకున్న పంచాయతీలు అంశాల వారీగా..

- **పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి :** మేడిపెల్లి మండలం దేశాయిపేట, గొల్లపెల్లి మండలం శంకరావుపేట, ఇబ్రహీంపట్నం మండలం డబ్బా.
- **ఆరోగ్యకరమైన పంచాయతీ :** జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి, బుగ్గారం మండలం శేకల్ల, మల్యాల మండలం గొర్రెగుండం.
- **చైల్డ్‌ఫ్రెండ్లీ పంచాయతీ :** జగిత్యాల మండలం అంబారిపేట, మేడిపెల్లి మండలం కల్వకోట, వెల్గటూర్ మండలం పడకల్.
- **తాగునీటి సరఫరా :** బుగ్గారం మండలం మద్దునూర్, బీర్‌పూర్ మండలం మంగెల, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్.



నాగులపేటలోని వననర్సరీలో మొక్కలు

- **పచ్చదనం పరిశుభ్రత :** కోరుట్ల మండలం నాగులపేట, పెగడపల్లి మండలం శాలపల్లి, కొడిమ్యాల మండలం నాచుపల్లి.
- **స్వీయ- సన్నద్ధమైన మౌలిక సదుపాయాలు :** ధర్మపురి మండలం దొంతాపూర్, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, మల్యాల.
- **సామాజిక భద్రత :** కథలాపూర్ మండలం కలిగోట, మెట్‌పల్లి మండలం చింతలపేట, రాయికల్ మండలం సింగరావుపేట.
- **సుపరిపాలన :** జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్, మల్లాపూర్ మండలం సిర్పూర్, రాయికల్ మండలం అల్లీపూర్.
- **మహిళా సాధికారత :** మేడిపెల్లి మండలం వల్లంపల్లి, మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్, కొడిమ్యాల మండలం హిమ్మత్‌రావుపేట.
- వీటికి ఈనెల 26న జగిత్యాలలో ప్రశంసపత్రాలు, అవార్డులు అందించారు.
- ఈనెల 31న హైదరాబాద్‌లో అవార్డులు, ప్రశంసపత్రాలు అందిస్తారు. వీటిని జాతీయస్థాయి పురస్కారాలకు సిఫారసు చేశారు.

అర్హులకు పింఛన్లు, ఉపాధి



గ్రామ జనాభా 2,548. ఇందులో 711 మందికి ఆసరా పింఛన్లు మంజూరయ్యాయి. 60 కుటుంబాలకు వందరోజులు ఉపాధిలో పని కల్పించాం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 522 మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

– రాణి, పంచాయతీ కార్యదర్శి, డబ్బా

రెండుపూటలా తాగునీటి సరఫరా



మా ఊరులో 250 కుటుంబాలున్నాయి. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇప్పించాం. పైపులైన్ సరిగా వేయడంతో నీటికి సమస్యలు లేవు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నల్లానీరు సరిపడేలా అందిస్తున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మా ఊరు ప్రత్యేకగుర్తింపు పొందడం సంతోషకరం.

– గుంటి లక్ష్మి, సర్పంచ్, ఫకీర్ కొండాపూర్

పచ్చదనం.. ఆహ్లాదం



మా ఊరిలో పచ్చదనం, పరిశుభ్రత ఉండాలని కంకణం కట్టుకున్నాం. వననర్సరీలో అవసరమైన మొక్కలు పెంచాం. గ్రామంలో విరివిగా మొక్కలు నాటించాం. పల్లెప్రకృతి వనంలో అన్నిరకాల మొక్కలు పెంచి చల్లటి వాతావరణం పెంపొందించాం. పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఉంది.

– చెన్నవేని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, నాగులపేట

అర్హులకు సంక్షేమ ఫలాలు



గ్రామంలో అర్హులకు సంక్షేమ ఫలాలు అందితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ఆ దిశగా అర్హులైన వారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయించాం. ప్రభుత్వ పథకాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించాం. అర్హులు సకాలంలో దరఖాస్తు చేసుకుని సంక్షేమ ఫలాలు పొందేలా చేశాం.

– రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి, కలిగోట

అందరి సహకారంతో అభివృద్ధి



అందరి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేయిస్తున్నాం. పచ్చదనం, పరిశుభ్రతలో మా ఊరుకు జిల్లాస్థాయిలో గుర్తింపు వచ్చింది. అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఇదేస్ఫూర్తితో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. గ్రామస్తుల సహకారం ఉంది.

– కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్, నాగులపేట

సంపూర్ణ అభివృద్ధి లక్ష్యం



పల్లెలను అన్నిరంగాల్లో ప్రగతిపథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం నిధులు విడుదల చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. దీంతో 27పంచాయతీలకు జిల్లాస్థాయి అవార్డులు దక్కాయి. వీటిని జాతీయస్థాయి అవార్డులకు సిఫారస్ చేశాం.

– శంకర్, డీఎల్పీవో, కోరుట్ల

న్యూస్‌రీల్

'అనర్హత'పై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్, మైనార్టీ, ఓబీసీ, ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసిల్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో తమ వైఫల్యాలను ఎత్తిచూపడమే కాకుండా బీజేపీకి వ్యతిరేకంగా దేశాన్ని ఏకం చేస్తున్నారనే కక్షతోనే రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క జీవన్‌కుమార్, మన్సూర్, నేహాల్, మోత్కూరి ప్రసాద్‌గౌడ్, బొల్లి శేఖర్, రేగుంట గంగాధర్, ఎస్కే ఇర్ఫాన్, ఎండీ అతాహుల్లా, ఎండీ రోహిత్, పోతుగంటి శంకర్‌గౌడ్, ముంజ రాజం, సంగన శంకర్, మంద వెంకటేశ్, కరం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



చింతకుంటలో పనులు పరిశీలిస్తున్న శివాజీ

కథలాపూర్(వేములవాడ): ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెంచాలని అడిషనల్ డీఆర్డీవో బాలె శివాజీ సూచించారు. బుధవారం చింతకుంట శివారులోని పోచమ్మకుంటలో పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో కూలీల సంఖ్య పెంచాలని, లేకపోతే ఆయా గ్రామాల అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, ఏపీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాల ఎదుట రద్దీ



'మీసేవ' వద్ద ప్రజల బారులు

ధర్మపురి: పాన్‌కార్డుకు ఆధార్ లింక్ తప్పనిసరి చేయడం, ఈనెల 31వ తేదీ వరకే గడువు విధించడంతో ప్రజలు పట్టణంలోని మీసేవా కేంద్రాల వద్ద బుధవారం గంటల తరబడి నిరీక్షించారు. వివిధ గ్రామాల నుంచి ఉదయమే పట్టణానికి చేరుకున్న ప్రజలు.. సాయంత్రం వరకూ నిరీక్షించారు. అయితే, పాన్‌కార్డు ఆధార్‌కు లింక్ చేసేగడువును జూన్ 30వ తేదీవరకు పెంచారని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఏప్రిల్‌లో ఉచిత బియ్యం

జగిత్యాలరూరల్: జిల్లాలోని తెల్లకార్డుదారులకు వచ్చే ఏప్రిల్‌లోనూ ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ బుధవారం తెలిపారు. ఏప్రిల్ 5 నుంచి రేషన్ దుకాణాల ద్వారా బియ్యం అందిస్తామన్నారు. డీలర్లు నిబంధనలు పాటిస్తూ బియ్యం పంపిణీ చేయాలని ఆయన సూచించారు.

ఆలయ అభివృద్ధి కమిటీ పునరుద్ధరణ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి రెనోవేషన్ కమిటీని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో నియమించిన 13 మంది సభ్యులను యథావిధిగా కొనసాగిస్తూ ఆదేశాలు ఇచ్చింది. మరో ఆరునెలలపాటు కమిటీ సేవలు అందిస్తుందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారని దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇందారపు రామయ్య, గందె పద్మ, అక్కెనపెల్లి సురేందర్, వీరవేని కొమురయ్య, చుక్క రవి, స్తంభంకాడి మహేశ్, ఇనుగంటి రమ, గునిశెట్టి రవీందర్, పల్లెర్ల సురేందర్, గుంపుల రమేశ్, వేముల నరేశ్, జైనా రాజమౌళి, సురేశ్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు.

టీచకపర్వంపై విచారణ

- అడిషనల్ డైరెక్టర్‌కు నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో టీచకుడైన శ్రీనివాస్ ఆగడాలపై బుధవారం విచారణ జరిగింది. తోటి మహిళా సిబ్బందిని అసభ్యకరంగా తాకుతూ వేధింపులకు పాల్పడుతున్న విషయాన్ని 'సాక్షి' కథనం ద్వారా వెలికి తీసిన సంగతి తెలిసిందే. శ్రీనివాస్ చేష్టలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ యాస్మిన్ బాషా అతన్ని ఈనెల 16వ తేదీన సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ విచారణలో భాగంగా బుధవారం ఏడీ డీఈవో శివకుమార్, ఎఫ్ఏవో రమేశ్‌కుమార్, రాయికల్ ఎంఈవో గంగాధర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మధ్యాహ్నం 12.20 గంటల నుంచి 3 గంటల వరకు విచారణ సాగింది. ఈ బృందం సభ్యులు మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులతో ముందుగా శ్రీనివాస్‌పై ఉన్న ఆరోపణలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం ఒక్కొక్కరితో సుమారు 10 – 15 నిమిషాల వరకు శ్రీనివాస్ పాఠశాలలో ఏ విధంగా ఉండేవారని, విద్యార్థులతో ఉపాధ్యాయురాళ్లతో ఎలా ఉండేవారని ఆరా తీశారు. పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.300 వసూలు చేశారా? పారిశుధ్య చార్జీలు వసూలు చేశారా? అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. లిఖిత పూర్వకంగా విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్ రూపంలో తీసుకున్నారు. అనంతరం బృందం సభ్యులు 'సాక్షి'తో మాట్లాడుతూ.. శ్రీనివాస్‌పై వచ్చిన ఫిర్యాదు ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టామని, ఈ నివేదికను మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్‌కు, కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.



స్టేట్‌మెంట్ రాస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

ప్రశాంత వాతావరణంలో మాలవిరమణ

- దీక్షాస్వాములకు సకల సౌకర్యాలు
- హన్మాన్ చిన్న జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్, వేదికపై కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్ తదితరులు

కొండగట్టు(చొప్పదండి): హన్మాన్ చినజయంతి సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి తరలివచ్చే దీక్షాస్వాములు ప్రశాంత వాతావరణం మాల విరమణ చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. అంజన్న సన్నిధిలో ఏప్రిల్ 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే హన్మాన్ చినజయంతి ఉత్సవాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ భాస్కర్, వివిధ శాఖల అధికారులతో కలిసి వారు బుధవారం ఆలయ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల విజయవంతం కోసం విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. పార్కింగ్, తాగునీటి సమస్య పరిష్కరించాలని, కోనేటిలో నీరు నింపాలని, అగ్నిమాపక చర్యలు తీసుకోవాలని, భక్తులకు సరిపడా అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తగినంత వైద్యసిబ్బందిని నియమించాలని అన్నారు. ప్రధానంగా ఆలయ పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కరోనా మళ్లీ విజృంభిస్తున్న దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కలిగించేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లడుతూ, భక్తుల భద్రతపై నిఘా ఉంచుతామన్నారు. దొంగలమర్రి, ముత్యంపేట, జేఎన్టీయూ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు. ఆలయ పరిసరాల్లో మెటల్ డిటెక్టర్లు బిగిస్తామని, ఇందుకోసం వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, జెడ్పీటీసీ కొండ పల్కాల రాంమోహన్‌రావు, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ టి.మారుతి, ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు!

- జిల్లాలో అనుమతిలేని ప్లాట్లు
- నిర్మాణాలకు అనుమతించని గ్రామ పంచాయతీలు
- అయినా, ఆగని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు



తిమ్మాపూర్‌లో అక్రమంగా ఏర్పాటుచేసిన ప్లాట్లు

జగిత్యాలరూరల్: జిల్లాలో అనుమతిలేని వెంచర్లు జోరుగా వెలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో ఈ దందా అధికంగా సాగుతోంది. నిబంధనలు అతిక్రమించి ఏర్పాటు చేస్తున్న వెంచర్లలో నిర్మాణాలకు గ్రామపంచాయతీలు అనుమతి నిరాకరిస్తున్నా.. ప్లాట్ల క్రయవిక్రయాలు ఆగడంలేదు. రెగ్యులర్ లే అవుట్‌ఉండి, రిజిస్ట్రేషన్ చేయించిన ప్లాట్లలోనే నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని ఆదేశిస్తూ రాష్ట్రప్రభుత్వం 31 ఆగస్టు 2020లో జీవో జారీచేసింది. ఈ జీవో జిల్లాలో ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.

'నాలా'కు తూట్లు..

- కొందరు వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యవసాయ భూముల్లో నేరుగా లేఅవుట్లు చేస్తున్నారు.
- అందులోని ప్లాట్లు విక్రయిస్తూ రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు.
- వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడం ద్వారా రెవెన్యూ శాఖకు ఆదాయం సమకూరేది.
- కానీ, అక్రమ లేఅవుట్ల ద్వారా రెవెన్యూ శాఖ ఆదాయం కోల్పోతోంది.
- లే అవుట్ నిబంధనలు అమలు చేయని చోట నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని జిల్లా పంచాయతీ అధికారి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు.
- అయినా, చాలామంది రియల్ వ్యాపారులు.. తమ రాజకీయ పలుకుబడితో ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వందల ఎకరాల్లో అక్రమ లే అవుట్లు..

జిల్లా కేంద్రానికి సమీపంలోని తిప్పన్నపేటలో సుమారు 140 ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. మోతె గ్రామంలో సుమారు 250 ఎకరాలు, ధరూర్‌లో దాదాపు 300 ఎకరాలు, లింగంపేటలో 40 ఎకరాలు, హస్నాబాద్‌లో 50 ఎకరాలు, తిమ్మాపూర్‌లో 70 ఎకరాలు, నర్సింగాపూర్‌లో 15 ఎకరాల్లో అనుమతులు లేకుండా ప్లాట్లు ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి, కోరుట్ల పట్టణ శివారుల్లోనూ దందా జోరుగా సాగుతోంది. మల్యాల మండలం ముత్యంపేట, రాజారం, కొడిమ్యాల మండలం పూడూరు, నాచుపల్లి, జగిత్యాల మండలం అంబారిపేట, హస్నాబాద్, నర్సింగాపూర్, ధరూర్, మోతె, తిమ్మాపూర్, తిప్పన్నపేట ప్రాంతాల్లోని అనుమతిలేని లేఅవుట్లపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు.. రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నవారు నిర్మాణాలకు అనుమతులు లభించక ఆందోళన చెందుతున్నారు.

అనుమతి లేదు



నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన ప్లాట్ల ఎలాంటి నిర్మాణాలకైనా అనుమతులు ఇవ్వవద్దని గ్రామపంచాయతీలకు ఆదేశాలు జారీచేశాం. అక్రమ లేవుట్లు ఉన్న ప్లాట్లలో పంచాయతీలు ఈ నిబంధనలు అమలు చేస్తున్నాయి. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు.

– నరేశ్, జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి

ముగిసిన ఇంటర్ పరీక్షలు



కళాశాల వద్ద విద్యార్థుల ఆనందం

కథలాపూర్(వేములవాడ): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం ఫస్టియర్ పరీక్షలు ముగియగా.. బుధవారం సెకండియర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంలో మునిగిపోయారు. ఇంటర్ జనరల్ కోర్సుల్లో జిల్లాలో 13,619 మంది విద్యార్థులు, వొకేషనల్ కోర్సుల్లో 2,353 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగియగానే విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జగిత్యాల: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు పరీక్షలు ఈనెల 31 నుంచి ఏప్రిల్ 1 వరకు 7 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని నోడల్ అధికారి నారాయణ తెలిపారు.

క్లుప్తంగా

వడ్డీ విడుదల చేయండి

జగిత్యాలటౌన్: విలీన గ్రామాల స్వశక్తి సంఘాలకు వడ్డీ బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. దాదాపు నాలుగేళ్లకు సంబంధించిన వడ్డీ బకాయిలు రూ.86.51కోట్లు పెండింగులో ఉండగా, ప్రభుత్వం రూ.22.70కోట్లు విడుదల చేసిందన్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లోని మహిళా సంఘాలకు ఒక్కపైసా రాలేదన్నారు. ఇలాంటి స్వశక్తి సంఘాలకూ వడ్డీ బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు.

దుకాణంలో దొంగతనం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ గ్యారేజీ దుకాణంలో దొంగతనం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ వ్యక్తి తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డాడు. కౌంటర్‌లో దాచిన నగదు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అలాగే బీడీ కాలనీలో కూడా తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. అందులో సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.

వ్యక్తి అరెస్ట్

జగిత్యాలక్రైం: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫొటోలను యూట్యూబ్ చానెల్స్‌లో ట్రోలింగ్ చేస్తున్న 8 మందిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అందులో మనజిల్లాకు చెందిన వద్లూరి నవీన్ ఉన్నారు.

పశుగ్రాసం దగ్ధం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కమ్మునూర్‌లోని రైతు మన్నె మల్లవ్వ తన కున్న గేదెల కోసం రూ.30 వేల విలువైన వరిగడ్డిని కట్టలు కట్టించి ఇంటి సమీపంలో నిల్వచేసుకుంది. నిప్పంటుకోవడంతో గడ్డి కాలిపోయింది. సర్పంచ్ బందెల మరియ, గ్రామస్తులు గ్రామపంచాయతీ ట్యాంకర్ సాయంతో నీళ్లు చల్లి మంటల్ని అదుపులోకి తెచ్చారు.

యూనిఫారమ్ మార్పు


యూనిఫారాలు ధరించిన విద్యార్థులు(ఫైల్)

జగిత్యాలక్రైం: ప్రభుత్వం సరఫరా చేసినవి కాకుండా ఒక రాజకీయ పార్టీ జెండా రంగు పోలిన యూనిఫారాలను సర్కారు పాఠశాలల విద్యార్థులకు ధరింపజేసిన ఫొటో బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బావోజీపల్లి ప్రభుత్వ పాఠశాల ఎస్జీటీ ఒడ్నాల రాజశేఖర్.. పాఠశాలలో గతంలో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చినవి కాకుండా రాజకీయ పార్టీ జెండా రంగును పోలిన రంగు గల యూనిఫారాలు అందజేశారు. అవే యూనిఫారాలతో కార్యక్రమం నిర్వహించారు. అప్పుడు తీసిన ఫొటో వైరల్‌గా మారడం చర్చనీయాంశంగా మారింది.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

జగిత్యాలక్రైం: విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా ఉమెన్ సెఫ్టీ వింగ్, విద్యాశాఖ ఆధ్వర్యంలో నెలరోజులుగా 60 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 240 మంది విద్యార్థులు, 120 మంది ఉపాధ్యాయులకు సైబర్ భద్రతపై శిక్షణ ఇస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి చైతన్య పరచడమే సైబర్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాలను పిల్లలు వినియోగిస్తున్నారని, ఈసమయంలో చాలాజాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

వివక్షలేని సమాజం ఎక్కడ?

- యథేచ్ఛగా కుల ధూషణలు
- యథావిధిగా సాంఘిక బహిష్కరణలు
- గతేడాది 100 ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు
- ఫలితమివ్వని సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు

కథలాపూర్(వేములవాడ): వివక్షలేని సమాజ నిర్మాణం లక్ష్యంగా.. అంటరానితనం నిర్మూలన ధ్యేయంగా.. అసమానతలు రూపుమాపడమే శిరోధార్యంగా ప్రతినెలా మండలంలోని ఒక్కో గ్రామంలో నిర్వహిస్తున్న సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడంలేదు. ఇందుకు గతేడాది సుమారు వంద వరకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు కావడం, కుల, సాంఘిక బహిష్కరణలు చోటు చేసుకోవడం అద్దంపడుతున్నాయి.


కథలాపూర్‌లో చేపట్టిన సివిల్ రైట్స్ డేలో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్(ఫైల్)

గతేడాది 100 అట్రాసిటీ కేసులు నమోదు..

- పౌర హక్కుల చట్టం ప్రకారం హోటళ్లు, ఉద్యాన వనాలు, క్రీడారంగాలు, విద్యాలయాలు, వసతి గృహాల్లో జాతి, మతం ఆధారంగా వేరుచేయడాన్ని నిషేధించారు.
- వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతీనెల చివరి రోజున మండలానికో గ్రామంలో వివిధ శాఖల అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నారు.
- ఇలా జిల్లా వ్యాప్తంగా నెలకోసారి 20 గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నారు.
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించి ప్రజలతో సమావేశం అవుతున్నారు.
- హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఉపయోగిస్తున్నారా? కుల వివక్ష చూపిస్తూ కించపరుస్తున్నారా? అనే అంశాలపై ఆరా తీసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.
- సాంఘిక దురాచారం సరికాదని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.
- అయినా, 2022 సంవత్సరంలో 100 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కావడం శోచనీయం.

విచారణలోనూ జాప్యమే..

కుల ధూషణలు, బహిష్కరణలపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. డివిజనల్ స్థాయి పోలీస్ అధికారి విచారణ చేయాల్సి ఉంటుంది. విచారణలో జాప్యం జరగడంతో బాధితులు నిరాశ చెందుతున్నారు. ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నా.. కుల వివక్ష, గ్రామ బహిష్కరణ లాంటి సంఘటనలు చోటుచేసుకోవడం విస్మయం కలిగిస్తోంది. కేసులు నమోదయ్యాక కూడా విచారణలో జాప్యం జరగడంపైనా బాధితులు ఆవేదన చెందుతున్నారు.

ఠాణా చుట్టూ తిరిగి విసిగిపోయా



మా ఊరిలో కూలీపని చేసుకొని బతుకుతున్న. కులం పేరుతో తిట్టారని గతేడాది అక్టోబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసిన. న్యాయం కోసం పదిసార్లు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగిన. మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయానికి మూడుసార్లు పోయి నా బాధ చెప్పిన. ఓసారి మాఇంటికి పోలీస్ అధికారులు విచారణకు వచ్చిండ్రు. కేసు ఏమైందో ఇప్పటికీ తెలియలేదు. న్యాయం ఏమోగానీ, తిరుగుడుతోని అప్పుల పాలైన.

– ఆయిల్వార్ సావిత్రి, బాధితురాలు, కథలాపూర్

విచారణ పేరిట జాప్యం చేస్తున్నారు..



ఓ వ్యక్తి నన్ను కులం పేరుతో తిట్టిండు. కించపరిచిండు. ఈ విషయంలో ఎనిమిది నెలల క్రితం మేడిపెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన. కేసు విచారణ దశలో ఉందని చెప్తున్నరు. అట్రాసిటీ కేసుల విషయంలో పోలీస్ అధికారులు విచారణను వేగవంతం చేయాలి. ప్రభుత్వం అందించే పారితోషికం త్వరగా ఇస్తే బాధితులకు భరోసా కలుగుతుంది.

– ఎస్.ప్రభాకర్, బాధితుడు, గోవిందారం, మేడిపెల్లి

సంఘటనలు తగ్గాయి



గ్రామాల్లో సివిల్ రైట్స్ డే ద్వారా పోలీస్, రెవెన్యూ తదితర అధికారులతో ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం. గ్రామస్తుల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాం. దీంతో గతంలోకన్నా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఇప్పుడు తగ్గాయి. కులం పేరిట దుర్భాషలాడితే బాధితులు ఫిర్యాదు చేయండి. శాఖాపరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

ఫిర్యాదు చేయండి



గ్రామాల్లో కుల వివక్ష చూపించినా, సాంఘిక, గ్రామ బహిష్కరణ చేసినా ప్రజలు నిర్భయంగా అధికారులకు చెప్పుకోవచ్చు. ప్రతినెలా ఓ గ్రామంలో అన్నిశాఖల అధికారుల ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నాం. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆ కార్యక్రమంలో బాధితులు తమ సమస్యలను చెప్పుకోవచ్చు. విచారణ జరిపి న్యాయం చేస్తాం.

– చిందం శ్రీనివాస్, తహసీల్దార్, కథలాపూర్

మహిళ ఆత్మహత్యాయత్నం

- చిట్టీ డబ్బులు మోసపోయానని మనస్తాపం

కథలాపూర్(వేములవాడ): ప్రతినెలా చిట్టీ డబ్బులు చెల్లించినా.. గడువు ముగిసిన తర్వాత తిరిగి ఇవ్వలేదు.. తాను మోసపోయానని భావించిన ఓ మహిళ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన అంబారిపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. అంబారిపేటలో ఓ మహిళ కొన్ని సంవత్సరాలుగా పలువురి వద్ద ప్రతినెలా డబ్బులు వసూలు చేసి చిట్టీ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఇప్పపెల్లి గ్రామానికి చెందిన అతికెం స్వప్న.. అంబారిపేటలోని ఆ మహిళ వద్ద ప్రతినెలా చిట్టీ డబ్బులు చెల్లిస్తూ వస్తోంది. అయితే, చిట్టీ గడువు ముగిసినా.. డబ్బులు తిరిగి ఇవ్వడంలేదు. విసిగిపోయిన అతికెం స్వప్న అంబారిపేటలోని సదరు మహిళ ఇంటికి బుధవారం వెళ్లి తనకు డబ్బు ఇవ్వాలని నిలదీసింది. తనకు రావాల్సిన రూ.3.50 లక్షలు ఇవ్వాలని పట్టుబట్టింది. తాను ఆ సొమ్ము ఇవ్వనని సదరు చిట్టీ నిర్వాహకురాలు తేల్చిచెప్పి, ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించింది. తాను చిట్టీ పేరిట రూ.3.50 లక్షలు చెల్లించి మోసపోయాయని, ఇంట్లోవారికి తెలిస్తే ఎలా అని మనస్తాపానికి గురైన స్వప్న.. క్రిమిసంహారక మందు తాగింది. స్థానికులు గమనించి కోరుట్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలు స్వప్నను ఏఎస్సై ఎండీ ఆలీ మొద్దీన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కుక్కల బారినుంచి కాపాడండి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

జగిత్యాల: మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువైందని, వాటి బారినుంచి ప్రజలను కాపాడాలని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ కోరారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. తనవార్డులో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయన్నారు. మంగళవారం ఒక వృద్ధుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయన్నారు. బుధవారం మరో బాలికపై దాడిచేసి చేతిని కరిచాయన్నారు. కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే కుక్కల బారినుంచి ప్రజలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే పందులు సైతం నిత్యం చనిపోతున్నాయని, ఏదో వైరస్‌తో ఇవి చనిపోతున్నాయని, వాటి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పశువైద్యులతో పరీక్షలు చేయించి కారణాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

'బెల్లంపల్లి ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణలు'

- నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్


మాట్లాడుతున్న నాయకులు

ధర్మపురి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నమల్లయ్యపై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని జగిత్యాల నేతకాని మహావీర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్ అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రెండురోజుల నుంచి సోషల్ మీడియా వేదికగా కొందరు గిట్టనివారు ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజల దీవెనతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, అది ఓర్వలేకనే అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూడలేకనే మూడోసారి గెలుస్తారనే అక్కసు నేపథ్యంలో మహిళలను అడ్డం పెట్టుకొని రాజకీయంగా ఎదుర్కొనే సత్తాలేకనే ప్రత్యర్థులు అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు పిప్పల గంగాధర్, ముడిమడుగు శ్రీనివాస్, జాడి రాజశేఖర్, గడ్డి దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

చల్‌గల్‌లో వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన సాంబారి రవి(57) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రవి గత కొద్దికాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంటి ముందు రేకుల షెడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

వరదకాలువలో దూకి వృద్ధుడి మృతి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): స్థానిక వరదకాలువలో దూకి సంగెపు మోహన్ (60) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సంగెపు మోహన్.. ఏడాదినుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆర్మూర్‌లోని ఆయుర్వేద క్లినిక్‌కు వెళ్లి మసాజ్ చేసుకుని వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి మంగళవారం ఉదయం ఇంట్లోంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో మెట్‌పల్లి మండలం రాజరాజేశ్వర్‌రావుపేట శివారులోని వరదకాలువలో దూకి చనిపోయాడు. ఎర్రాపూర్ గ్రామ శివారులో మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు నరేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధిపై సమీక్ష

సారంగాపూర్(జగిత్యాల): దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధిపై దేవాదాయ, ధర్మాదాయ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు బుధవారం సమీక్షించారు. తొలుత స్వామివారిని దర్శించుకున్న అనంతరం అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. కోనేరు సమీపంలో దాతల సాయంతో నిర్మిస్తున్న విశ్రాంతి గదులు పరిశీలించారు. రూ.85 లక్షలతో చేపట్టే రాజగోపురం, ప్రాకార మండపం పనులు ప్రారంభించే విషయంపై చర్చించారు. ఈవో కోస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, రెనోవేషన్ కమిటీ సభ్యులు కొంగరి జయ, పాంపట్టి కవిత, దుగ్యాల మధుకర్‌రావు, అత్తినేని నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట శ్రీసీతారాములుకు పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న అధికారులు

ధర్మపురి: కరీంనగర్ జిల్లాలోని ఇల్లంతకుంట శ్రీసీతారామచంద్రస్వామికి ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పక్షాన పట్టువస్త్రాలు, తలంబ్రాలను తీసుకెళ్లారు. ఏటా శ్రీరామనవమి సందర్భంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్లి అక్కడి అధికారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, రెనోవేషన్ కమిటీ సభ్యుడు రామన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రాజన్న సన్నిధిలో రామన్న పెళ్లి


విద్యుత్ దీపాల వెలుగుల్లో రాజన్న ఆలయం


రాజన్న చెంతకు తరలివస్తున్న భక్తులు

- భారీగా తరలివస్తున్న శివపార్వతులు
- కిక్కిరిసిన రాజన్న ఆలయం
- మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు
- కల్యాణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం ఉదయం 11.55 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరిపేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే వేలాదిగా శివపార్వతులు వేములవాడకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. శివపార్వతుల పూనకాలు, హిజ్రాల నృత్యాలతో వేములవాడ పట్టణం సందడిగా మారింది. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు షామియానాలు వేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చైర్మన్ చాంబర్ వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివారల కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకు రూ.16 లక్షలతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఈ రాజేశ్ తెలిపారు. 2 లక్షల లీటర్ల తాగునీటి పాకెట్లు అందుబాటులో ఉంచారు. దాతల సాయంతో 5 వేల లీటర్ల మజ్జిగను భక్తులకు అందజేయనున్నారు. 11 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆటోల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, స్వామివారలను భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం కన్నులపండుగా జరగనుంది. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు

రాజన్న ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి స్థానిక మున్సిపల్ పాలకవర్గం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేస్తారు. గురువారం ఉదయం 8 గంటలకు చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు కమిషనర్ అన్సారీ బుధవారం తెలిపారు.

వేములవాడలో వింతైన తంతు

రామన్న పెళ్లి రోజున రాజన్నతో వివాహమాడటం ఇక్కడో వింతైనతంతు. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం మామూలే. కానీ ఈ గుడిలో రాజన్నను భర్తగా భావించి శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు, కల్యాణమాడుతారు. బాల్యం నుంచే శివపార్వతులుగా మారుతున్న బాలికలు సైతం ఉన్నారనడంలో అతిశయోక్తిలేదు. అయితే తాము అనారోగ్యం బారిన పడటంతో శివపార్వతీగా మారుతానని మొక్కుకున్నామని, ఆరోగ్యం బాగుపడిందని, అందుకే శివపార్వతీగా మారామని పలువురు చెబుతున్నారు.

శివపార్వతులకు సర్వం సిద్ధం

కల్యాణోత్సవంలో పాల్గొనే శివపార్వతులకు శివుడిని పెళ్లి చేసుకునేందుకు అవసరమైన వస్తువులను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుంటే.. లింగభేదం లేకుండా కాళ్లకు రాగి మెట్టెలు, చేతులకు రాగి వస్తువులు, చేతిలో త్రిశూలం పట్టుకుని, నెత్తిన జీలకర్ర పెట్టుకుని, బాసింగాలు కట్టుకుని, మెడలో రుద్రాక్ష వేసుకున్న శివపార్వతులు శివుడిని పెళ్లాడటం ఈ క్షేత్రంలో ఆనవాయితీగా వస్తోంది. కాగా శివపార్వతుల కోసం ఆలయ ప్రాంతం, జాతరాగ్రౌండ్ తదితర ప్రాంతాల్లో రాగి వస్తువులు, రుద్రాక్ష, త్రిశూలం, లింగాలు, గంటలు, బాసింగాలు అమ్మేందుకు బుధవారం అన్ని సిద్ధంగా ఉంచారు.

సెర్ప్ ఉద్యోగులకు అభినందన

- వందశాతానికి మించి బ్యాంకు లింకేజీ


అభినందిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలరూరల్: 2022–23 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ వందశాతం ప్రగతి సాధించిన సెర్ప్ ఉద్యోగులను కలెక్టర్ యాస్మిన్ బాషా బుధవారం అభినందించారు. బ్యాంక్ లింకేజీ 12,496 సంఘాలకు రూ.704.21 కోట్ల లక్ష్యం కాగా, 10,174 సంఘాలకు రూ.707.95 కోట్లతో 100.53 శాతం ప్రగతి సాధించడం అభినందనీయమన్నారు. రికవరీలో కూడా 99 శాతం నమోదు చేసి మహిళా సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో లక్ష్మీనారాయణ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఏపీడీ సుధీర్, డీపీఎంలు మణిక్‌రెడ్డి, మల్లేశం, వెంకటేశం, వనజ, సెర్ప్ జాక్, నాయకులు దాస్, రాజయ్య, గంగాధర్, రమాదేవి, శ్రీనివాస్, శంకర్, సత్యం, రవీందర్, చంద్రకళ, రత్నాకర్, మరియా, పుష్పలత పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు చేపట్టే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, జిల్లాలో పదో తరగతి పరీక్షలకు బాలురు 5,747 మంది, బాలికలు 5,430 మంది హాజరవుతారన్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థుల కోసం 68 పరీక్ష కేంద్రాలు, ప్రైవేట్ విద్యార్థుల కోసం ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ భాస్కర్, అడిషనల్ కలెక్టర్లు లత, మకరంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్లపాటు విధులకు గైర్హాజరు

- నిబంధనలు అతిక్రమించి మళ్లీ పోస్టింగ్
- అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

జగిత్యాల: జిల్లాలోని రాయికల్ మండలం తాట్లవాయి ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు 2003 సెప్టెంబర్ నుంచి విధులకు గైర్హాజరవుతున్నారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకునే బదులు.. ఇటీవల మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు దారితీస్తోంది. క్లాసిఫికేషన్ కంట్రోల్ అప్పీల్(సీసీఏ) నిబంధనల మేరకు ఉన్నతాధికారుల అనుమతితో ఓ ఉద్యోగి గరిష్ఠంగా ఐదేళ్లపాటు దీర్ఘకాలిక సెలవు తీసుకునే అవకాశం ఉందని, అయితే, అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఏడాదిపాటు విధులకు గైర్హాజరైనా ఉద్యోగం కోల్పోవాల్సి ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తూ ఆ ఉపాధ్యాయుడికి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్ పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు గతనెల 20న ఉత్తర్వులు జారీచేశారు. అయితే, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు రావడంతోనే తాము విధుల్లోకి తీసుకున్నట్లు ప్రస్తుత విద్యాధికారి స్పష్టం చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

సుమారు 20ఏళ్లపాటు పాఠశాల విధులకు దూరంగా ఉంటున్న ఉపాధ్యాయుడికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వడంపై విచారణ జరపాలని కోరుతూ ఎస్టీయూ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఐదు సంవత్సరాలు పాటు విధులకు గైర్హాజరైన ఉద్యోగి వివరాల గురించి ప్రభుత్వానికి నివేదించాల్సిన ఉన్నతాధికారి.. 20 ఏళ్ల తర్వాత వచ్చిన ఉద్యోగి నియామక ఫైల్‌ను ఫార్వార్డ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇది సీసీఏ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. దానికి పాఠశాల విద్యాశాఖ అనుమతి ఇవ్వడం, ఉత్తర్వులు జారీచేయడం నిబంధనలకు విరుద్ధమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈనియామకం ప్రక్రియపై విచారణ జరిపి బాధ్యులైన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయండి


మాట్లాడుతున్న బోనగిరి దేవయ్య

జగిత్యాలటౌన్: ప్రతినెలా ఒకటో తేదీన తమ బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు జమచేయాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గీతా గ్రంథాలయంలో తపస్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, స్కావెంజర్లను నియమించాలని, ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నరేందర్‌రావు, వొడ్నాల రాజశేఖర్, వెంకటరమణారావు, శ్రీనివాస్, మహిపాల్, నీలిమ, అనిత ఉన్నారు.